క్లుప్తంగా

పల్లె వీరుడు కొమ్మెర్ల



రాజుపాలెం: దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరులోని ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ హాలులో చుండూరు దళిత పల్లె వీరుడు కొమ్మెర్ల అనిల్ కుమార్ 33వ స్మారక సభ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు సాతులూరి రామాంజనేయులు సోమవారం తెలిపారు. చౌటపాపాయపాలెం పులిచింతల నిర్వాసిత కేంద్రం కొత్త బోధనంలో ఈ మేరకు గోడ పత్రికలను ఆవిష్కరించారు. స్మారక సభకు ఎస్సీ, ఎస్టీ దళితులందరు హాజరు కావాలని ఆయన కోరారు. నాయకులు ఎల్‌హెచ్‌పీ చంద్రానాయక్, మద్దు నరసింహారావు, మద్దు యాకోబు, మద్దు ప్రేమ్‌రాజు, కోటా వంశీ, సాతులూరి ఎలిజిబెత్, మద్దు నాగరాజు, బాణావతు బాలస్వామినాయక్, జంగిలి నాగేశ్వరరావు, జంగిలి రాజా పాల్గొన్నారు.

బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



క్రోసూరు: విప్పర్ల గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన చిలకా రవీంద్రనాథ్ లివర్ వ్యాధితో విజయవాడలోని నాగార్జున ఆసుపత్రిలో పదిరోజులుగా చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న వట్టి చెరుకూరు ఎంపీపీ చిల్కా సుబ్బారావు సోమవారం ఆసుపత్రిలో పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సుబ్బారావుకు సంఘీభావంగా తెలుగు రాష్ట్రాలలోని చిలకా కుటుంబాలు రూ.46వేలు పంపించాయి. విప్పర్ల గ్రామంలోని బాధితుడి స్నేహితులు మరో రూ.10 వేలు అందజేశారు. మొత్తం రూ.61 వేలు ఆర్థిక సాయం సుబ్బారావు అందజేశారు. విప్పర్ల, క్రోసూరు చిలకా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పెదకూరపాడు: మాగులూరి ఫౌండేషన్ సభ్యులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. డాక్టర్ విద్యా మాట్లాడుతూ గర్భిణులు తప్పక పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్ పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు తులసీ తన్మయ్



నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ద్వితీయ సంవత్సరం నర్సింగ్ విద్యార్థిని వి.తులసీతన్మయ్ జాతీయస్థాయి తైక్వాడ్ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ సోమవారం తెలిపారు. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన ద్వితీయ అస్మితా తైక్వాండో ఉమెన్స్ లీగ్-2024 రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలలో తులసీ తన్మయ్ ప్రతిభ చూపి ఆంధ్రప్రదేశ్ సీనియర్స్ మహిళా టీంకు ఎంపికైనట్టు వివరించారు. తమిళనాడులోని దిండిగల్‌లో ఈనెల 11 నుంచి 14వతేది వరకు జరగనున్న తైక్వాండో పోటీలలో తులసీతన్మయ్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటున్న తులసీ తన్మయ్‌ను కళాశాల పాలకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త, ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, అధ్యాపకులు అభినందించారు.

అదుపుతప్పి పల్టీ కొట్టిన కారు



నరసరావుపేట రూరల్: రావిపాడు రోడ్డులో కారు అదుపుతప్పి కాలువలోకి పల్టీ కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు నకరికల్లు నుంచి నరసరావుపేటకు వస్తున్న కారు రావిపాడు ఎస్సీ కాలనీ సమీపంలోకి రాగానే అదుపు తప్పింది. పక్కనే కాలువలోకి కారు పల్టీ కొట్టింది. స్థానికులు వెంటనే స్పందించి కారులో ఉన్న డ్రైవర్‌ను బయటకు తీశారు. డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు.



రాజుపాలెంలోని కోటనెమలిపురిలో నిమజ్జన ఊరేగింపు



ముప్పాళ్ల మండలం బొల్లవరంలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథుడు



క్రోసూరులోని విద్యా నగర్‌లో గణనాథుడికి పూజలు



క్రోసూరులో బాల గణనాథుడి ఊరేగింపు

గణేశ్ మహరాజ్‌కి.. జై

ఆదిదేవుడు గణనాథుడికి ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణంలోని నాగార్జున నగర్‌లోని శ్రీశ్రీ నగర్‌లో శ్రీ సత్యసాయి యువజన సంఘం ఆధ్వర్యంలో పర్యావరణహితమైన 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. సోమవారం అన్న సంతర్పణలు నిర్వహించి వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

– సత్తెనపల్లి



సత్తెనపల్లి వృద్ధిగార్డినియా అపార్ట్‌మెంట్‌లో మహిళల పూజలు



అమరావతిలో క్రేన్ సాయంతో నిమజ్జనానికి విగ్రహం తరలింపు



అచ్చంపేట రాజీవ్‌నగర్ కాలనీలో వడియరాజుల అధ్వర్యంలో గణనాథుడికి పూజలు



పెదకూరపాడు 75త్యాళ్లూరు నుంచి నిమజ్జనానికి భారీ వినాయకుడు



సత్తెనపల్లిలోని వడ్డవల్లి పీర్లచావిడి వద్ద పూజలందుకుంటున్న గణనాథుడు



నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

జాగ్రత్తలతో అవిఘ్నమస్తు

సత్తెనపల్లి: జీవితం ఎంతో విలువైనది. పండుగలు, ఉత్సవాల సందర్భంగా అత్యుత్సాహాన్ని ప్రదర్శించే క్రమంలో ప్రాణాలనే పోగొట్టుకోవడం చాలా బాధాకరం. గణపయ్య నిమజ్జన వేడుకలు మూడో రోజు సోమవారం నుంచి ప్రారంభ మయ్యాయి. నిమజ్జనం సందర్భంగా పలు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులు ఎప్పటికప్పుడే హెచ్చరిస్తూనే ఉన్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి...

- చీకటి పడక ముందే నిమజ్జనం చేయాలి.
- నిమజ్జన సమయంలో పెద్దలు మాత్రమే నీటిలో దిగాలి.
- నిమజ్జనం పూర్తయ్యాక అందరూ ఉన్నారా లేదో.. సరి చూసుకోవాలి.
- చేతితో టపాసులు పేల్చడం చాలా ప్రమాదకరం. ఉత్సవ కమిటీలు వారిపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- కర్ర సాము వంటివి చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- విద్యుత్ తీగలు తగలకుండా ఉండేలా వాహనంపై విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలి.
- ట్రాక్టర్ల పై నుంచి కానీ, నేలపై నిల్చొని పల్టీలు కొట్టకూడదు.



వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



సత్తెనపల్లిలోని అమరావతి మేజర్ కాలువ వద్ద బారికేడ్ల ఏర్పాటు

నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా చేసుకోవాలి

వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా చేసుకోవాలి. విగ్రహాల నిమజ్జనం ఊరేగింపులో పాల్గొనే ప్రతి ఒక్కరూ జాగ్రత్తలను పాటించాలి. ముఖ్యంగా పిల్లలు, యువత అత్యుత్సాహాన్ని ప్రదర్శించవద్దు. మద్యం సేవించరాదు. అమరవాతి మేజర్ కాలువ వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేశాం. నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు ఉత్సవ కమిటీలు పోలీసు శాఖకు అన్ని విధాల సహకరించాలి.

– బి.బ్రహ్మయ్య, సీఐ, సత్తెనపల్లి టౌన్

వీఆర్‌ఏపై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

అమరావతి: మండల పరిధిలోని లేమల్లె వీఆర్‌ఏ షేక్ జాన్‌పై మారణాయుధంతో దాడి చేసిన ఉడతా గోపిని అరెస్టు చేసి శిక్షించాలని జిల్లా వీఆర్‌ఏ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సీఐ శ్రీనివాస రావుకు, తహసీల్దార్ నాగమల్లేశ్వర రావుకు వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏ సంఘం అధ్యక్షుడు షేక్ బంద్ గీ సాహెబ్ మాట్లాడుతూ అర్ధరాత్రి వీఆర్‌ఏ జాన్ తన ఇంటి వరండాలో నిద్రిస్తున్న సమయంలో గేటు దూకి వచ్చి ఉడతా గోపి ఇనప రాడ్డుతో దాడి పాల్పడ్డారన్నారు. జాన్‌పై జరిగిన దాడిపై విచారణ చేపట్టాలని కోరారు. నిందితుడు ఉడతా గోపి నుంచి జాన్ కుటుంబానికి రక్షణ కల్పించాలని సీఐకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తగిన చర్యలు తీసుకోరపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి సూరిబాబు వీఆర్‌ఏల సంఘ నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏ సంఘ నాయకులు

త్రికోటేశ్వర రైతు సంఘం కార్యాలయం ప్రారంభం

నరసరావుపేట రూరల్: లింగంగుంట్లలో త్రికోటేశ్వర రైతు సంఘం కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. లింగంగుంట్ల అగ్రహారం భూముల సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘం కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ త్రి కోటేశ్వర రైతు సంఘాన్ని 2007లో రైతులు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యాలయంలో లింగంగుంట్ల భూములకు సంబంధించిన డాక్యుమెంట్ల పరిశీలన జరుగుతుందని తెలిపారు. రైతులు తమ ఇళ్లు, ప్లాట్లకు సంబంధించిన డాక్యుమెంట్లు నకళ్లను తీసుకు వచ్చి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ సర్వీస్‌లో సరి చూసుకోవాలని సూచించారు. లింగంగుంట్ల అగ్రహారం రైతుల భూములను సాగుభూములు, ఇల్లు, కమర్షియల్ స్థలాలుగా మూడు వర్గాలుగా విభజించడం జరిగిందన్నారు. రైతులు తమ భూములు ఏ పరిధిలోకి వస్తాయో ముందుగానే నమోదు చేసుకోవాలన్నారు. దీని ప్రకారం పుష్పగిరి పీఠం అధికారులు, దేవదాయ శాఖ అధికారులు నిర్ణయించిన పన్ను పరిధిలోకి భూములు వస్తాయని వివరించారు. ఆయా వర్గాలు పుష్పగిరి మఠం నిర్ణయించిన ధర చెల్లించిన మీదట ఆయా రైతుల పేరుపై రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పొన్నపాటి ఈశ్వర రెడ్డి, యాదాల మహానంది రెడ్డి, కామిరెడ్డి నర్సిరెడ్డి, గంగుల పెద్దిరెడ్డి, యేరువ బాల మోహన రెడ్డి, పొన్నపాటి వీరారెడ్డి పాల్గొన్నారు.



లింగంగుంట్లలో రైతు సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నారై మాగులూరి భానుప్రకాష్ సోమవారం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు ఏ అవసరం వచ్చినా వైద్యులు, సిబ్బంది తనను సంప్రదించవచ్చునన్నారు. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజక వర్గాల్లో విద్య,వైద్యం, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎన్నారైలు ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. మాగులూరి ఫౌండేషన్ అందిస్తున్న సేవలను అభినందించారు. వరద బాధితుల సహాయార్థం పణిదం పీఏసీఎస్ నుంచి రూ. 20 వేలు, గ్రామ నాయకులు, ప్రజల ద్వారా పంచాయతీ కార్యదర్శి దాచేపల్లి వీరాంజనేయులు సేకరించిన రూ.60 వేలు నగదు చెక్కులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు అందజేశారు. అంబేడ్కర్ రోడ్డులో ఉన్న షాలోమ్ చర్చిలో సమైఖ్య కాపరుల సహవాసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, నాయకులు నాగేశ్వరరావు, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, ఆళ్ళ అమరేశ్వరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



వరద బాధితుల సహాయర్థం నగదు చెక్కును ఎమ్మెల్యే కన్నాకు అందిస్తున్న వీరాంజనేయులు

ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి

సత్తెనపల్లి: ఎన్నికలకు ముందు టీడీపీ భవన నిర్మాణ కార్మికుల ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి సిలార్ మసూద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం సత్తెనపల్లి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. సిలార్ మసూద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు అమలవుతున్న సంక్షేమ పథకాలను నిలుపుదల చేస్తూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన మెమో 1,214 ను రద్దుచేసి ఆదుకోవాలన్నారు. దీంతో జిల్లాలో సుమారు రూ.6 కోట్ల వరకు సంక్షేమ బోర్డు నుంచి భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన లబ్ధి నిలిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కోట ఆంజనేయులు, పెదాల శ్రీను, సీహెచ్ రామారావు, షేక్ అహమ్మద్, బి.దానియేలు, షేక్ హుస్సేన్నా పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కన్నాకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

పంట పొలాల పరిశీలన

అమరావతి: మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఇటీవల వరదల కారణంగా నీట మునిగిన పంటలను సోమవారం వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం క్షేత్ర పరిశీలన చేపట్టింది. ఈ పరిశీలనలో లాం ఫాం శాస్త్రవేత్తలు పి.అమరజ్యోతి, ఎం.వెంకటరాములు, క్రోసూరు వ్యవసాయశాఖ ఏడీఏ వి.హనుమంతరావు, స్థానిక ఏఓ అహ్మద్ అమరావతిలో నీటమునిగిన పత్తి పోలాలను పరిశీలించారు. వెంకటరాములు మాట్లాడుతూ పత్తి పైరులో పచ్చదోమ, తెల్లదోమ నివారణకు డైపేన్త్యురాన్‌ను లీటరు నీటికి 0.4గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. ఏడీఏ వి.హనుమంతరావు మాట్లాడుతూ నీటమునిగిన పొలాలకు చెందిన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో తగిన పత్రాలను సమర్పించి, నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అమరావతిలో పత్తి పంట పరిశీలన

బాల్ బ్యాడ్మింటన్‌కు బాలికల ఎంపిక

శావల్యాపురం: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు ఏడుగురు బాలికలు ఎంపికైనట్లు శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎంపికైన బాలికలతో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ చూపి శావల్యాపురం హైస్కూలకు మంచి పేరు తేవాలన్నారు. వేముల దివ్య (ఇంటర్) మూట్లూరి లూధియా (ఇంటర్) బండారు దేవమణి (ఇంటర్) ఆర్.రత్నకీర్తన (10వ తరగతి) బండారు రవళీ (9వ తరగతి) ఉప్పు లలిత (9వ తరగతి) చల్లా శ్రీహర్షిత (9వ తరగతి) ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 15 తేదీ వరకు తూర్పు గోదావరి జిల్లా అన్నవరంలో జరిగే తొమ్మిదవ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, స్టాఫ్ సెక్రటరీ సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, కుమ్మరి శ్రీనివాసరాజు, శ్రీకాంత్, భువనేశ్వరీ ప్రత్యేకంగా అభినందించారు.

నేడు మాజీ ఎమ్మెల్యే శంకరరావు పర్యటన

అమరావతి: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల మండల పరిధిలోని నీట మునిగిన పంటలను మంగళవారం పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పరిశీలిస్తారని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైకుంఠపురం, పెదమద్దూరు, చావపాడు, ఎండ్రాయి, నరుకుళ్ళపాడు, అమరావతి, మునగోడు గ్రామాలలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పటుతుందని ఇన్‌చార్జి ఏఈ భాస్కర రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

విద్యార్థులకు ఉచిత ప్రయాణం కల్పించాలి

వినుకొండ(నూజెండ్ల): గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు, మండల కేంద్రాలకు వచ్చి ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుకునే విద్యార్థులకు రాష్ట్రప్రభుత్వం పల్లె వెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర కన్వీనర్ మహంకాళి సుబ్బారావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 1 నుంచి 10వ తరగతి వరకు చదువకునే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పల్లె వెలుగు బస్సుల్లో ఉచితంగా పాసులు ఇచ్చి ప్రయాణం చేస్తున్నారని, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు కూడా ఉచితంగా పాసులు ఇప్పించి ప్రయాణం కల్పించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం సీతారామపురంలోని ఎస్.వి.ఎస్.సీ. హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి రెడ్డికొత్తూరు గ్రామానికి చెందిన తుపాకుల వీరభద్రారెడ్డి (2001-06 బ్యాచ్) కంప్యూటర్, స్పీకర్స్‌ను బహూకరించారు. దాత వీరభద్రారెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. కామేశ్వరరావు శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.